# దశమ చేనేత సప్తాహము

**1-3-1964** నుండి **8-3-1964** వరకు

జింఖానా గ్రౌండ్సు ఆవరణములో

## "కోప్ ఫాబ్రిక్స్"

చేనేత వస్త్రముల అమ్మకముపై ప్రత్యేక తగ్గింపు రూపాయికి 10 న. పై. రిబేటు

నాణ్యమైన చేనేత చీరెలు, ధోవతులు, షర్టింగులు, దుప్పట్లు, క్యాలెండరు చేయబడిన లాంగ్ క్లాత్ మల్లులు, చెక్ షర్టింగులు వగైరా .... వగైరా

కుటుంబములో అందరికి తగ్గ రకములు విక్రయించబడును. ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత సంఘములన్నింటిలోను మా డిపోలలోను ఈ సప్తాహ సందర్భమున అనగా 1-3-1964 నుండి 8-3-1964 వరకు ప్రత్యేక రిబేటు ఇవ్వబడును.

**ఆంధ్ర చేనేత సహకార సంఘము లి.,**

**విజయవాడ-3**



# ఉగాది పండుగ సందర్భంలో

## మా శుభాకాంక్షలు

# నాథ్ లేబొరేటరీస్

యూసుఫ్ గూడా రోడ్డు

బేగం పేట (పోష్టు)

**హైదరాబాదు—16**






# దొంగ

మసక మసకగా వుంది వెన్నెల. చెట్లకింద ఉన్న చీకటి లోంచి నడుస్తున్నాడు గోపాలం. మోకాళ్ళపైకి ఎగకట్టిన పంచె కట్టూ, ఛాతీకి బిగుతుగా అంటుకొని పోయిన బనీనూ, మొలలో చిన్న కత్తీ - ఆత్మ విశ్వాసంతో ధైర్యంతో ఉన్నాడు గోపాలం....

మధ్యమధ్య త్రేణువులు వస్తున్నాయి పల్లపల్లగా - ఒకేఒక గ్లాసుడు నాటు సారా పుచ్చుకున్నాడు బలానికి, హుషారుకి. చదువు రాని వాడైనా, ప్రతీదీ ఒక ప్లాను ప్రకారం నడవాలి గోపాలానికి. ఏవి చేసినా ముందూ వెనకా చూసి ఆలోచించి బేరీజు వేసే అలవాటు వుంది అతనికి. ఒక స్వాభావికమైన వివేకంవుంది. అందుకే

## బాలగంగాధర తిలక్

రత్తయ్యా, సోములూ ఎంతో నమ్మకం వుంచి అతనిమీద యీ బాధ్యత వేశారు. వాళ్ళిద్దరూ లేకుండా ఉంటే, పనులు సవ్యంగా జరుగుతాయి.వాళ్ళిద్దరికీ నిదానం లేదు. వుత్త కంగారు, వుత్తి ఆశతప్ప.

రాత్రి ఒంటిగంట దాటితే కాని ఆవిడ మొగుడింటికిరాడు. రెండువారాలు పరిశీలనగా చూసి యీ విషయం గ్రహించాడు. ఆ క్లబ్‌లో కూర్చుని ఖరీదైన మందు తాగుతూ పేకాడుతూ డబ్బయిపోయేవరకూ అక్కడే వుంటాడు. ఈలోగా అతని భార్య వొంటరిగా యింట్లో వంటగదికి పక్కగా వున్నగదిలో పడుకుని నిద్రపోతుంది. వంటగదికి దొడ్లోనుంచి వెళ్లాలి. దొడ్డి చాలా పెద్దది. ఎన్నో మొక్కలూ చెట్లూవున్నాయి, వాటి నీడలో తాను కనిపించడు. మరీ మంచిది. వంటగది కిటికీ వానకి తడిసి ఎండకి ఎండి కమ్ములుపట్టు తప్పివున్నాయి. బలంగా తెలివిగా పనిచేస్తే మూడు నాలుగు ఊచల్ని తీసెయ్యవచ్చును. ఇంక ఒకసారి వంటగదిలో ప్రవేశించాక పని చాలా సులభం. తాను అవతల గది తలుపు కొడతాడు మెల్లగా. ఆవిడ ఏ ఎలకో పిల్లో అనుకుని తలుపుతీస్తుంది. అంతే, తాను కత్తి చూపించి భయపెడతాడు, మెళ్ళో ఉన్న నాలుగుపేటల గొలుసు ఒడుపుగా తాపీగా తీసుకుంటాడు. ఆమె తెప్పరిలే లోపల, కేకవేసేలోపల తోటలోకి చీకట్లోకి అదృశ్యుడైపోతాడు.


గోపాలం యిలాగ తన ప్లానంతా ఆలోచించుకుంటూ నిబ్బరంగా నడుస్తున్నాడు. రోడ్లు నిర్మానుష్యంగా వున్నాయి — అక్కడక్కడ ఒకరిద్దరు రాత్రించరుల్ని తప్పించి. ఊరికి దూరంగా వున్న కొత్తపేట యిది. ఊళ్ళోవున్న జనసంచారమూ అలజడీ యిక్కడ వుండవు. మొదటి ఆట అయిపోగానే మొగలోవున్న కిళ్ళీకొట్లూ' చిన్న కాఫీహోటలూ మూసేస్తారు. చాలా యిళ్ళు నిద్రలో మునిగిపోయాయి. కొన్ని యిళ్ళలోంచిమాత్రం విద్యుద్దీపకాంతి కిటికీల లోంచి వస్తోంది. మొత్తమ్మీద వీధులూ యిళ్లూ ఆ మసక వెన్నెలలో ఒంటరిగా గోపాలంకోసం యెదురు చూస్తోన్నట్టు వున్నాయి.

గోపాలానికి తను చేసేపనిమీద నైతిక సందేహాలు ఏమీలేవు, దొంగతనం తప్పనీ, పాపమనీ అతను అనుకోలేదు. ఎందరో తమతమ అవసరాలకి యెన్నో వృత్తులూ ఉద్యోగాలు చేసినట్టుగా అతనూ యిది చేస్తూన్నాడేతప్ప మంచి చెడ్డల సూక్ష్మ విచారణ చేసేప్పవికితనం కాని, అసలటువంటి ఆలోచనలకి అవసరం కాని అతనికి కనిపించలేదు. అందువలన అతనికి అంతరాత్మని నొక్కవేయడమూ ఒప్పించడమూ లాంటిబాధలుకలగలేదు. తనపనిలో దొరికిపోతేజైలుకి వెళ్లాలన్న భయమూ జ్ఞానమూ వున్నాయిఅతనికి. అందుకేజాగ్రత్తగా ప్లాను వేసుకుంటాడు. ఎంతో అవసరమైతే కాని రత్తయ్యనీ సోముల్నీ వెంట తీసుకుని వెళ్ళడు. వాళ్ళిప్పుడు తనకోసం ఆశగా ఎదురు చూస్తూంటారన్న ఆలోచన అతనికి మరింత ఉత్సాహం యిచ్చింది.

ఆయిల్లు మసక వెన్నెల్లో ముడుచుకున్న తాబేలులా వుంది. ప్లాన్ప్రకారం యింటి వెనక్కివెళ్ళి దొడ్లోకి ప్రవేశించాడు. అరటిచెట్లూ కొబ్బరిచెట్లూ ఏవేవో మొక్కలూ తుప్పలూ అంతా గలీజుగా చీకటిగావుంది. నెమ్మదిగా నడచి వంటగదిదగ్గరకు వచ్చాడు గోపాలం. కిటికీ వూచల్ని ఒకసారి లాగి చూశాడు. ఇంతలో అతనికి లోపల్నుంచి మాటలు వినిపించాయి. అతనికి ఆశ్చర్యం కలిగింది. అతని పథకం అప్పుడే









దెబ్బతిన్నట్టనిపించింది. ఈసారి మాటలు కొంచెం గట్టిగా కోపంగా వినవచ్చాయి. గోపాలానికి కుతూహలం కలిగింది. బహుశా ఆ వచ్చిన వాళ్ళెవరైనా మళ్ళీ వెళ్ళిపోవచ్చును, తన మార్గం నిరాటంకమవవచ్చును అనికూడా అనిపించింది. ఒకవేళ ఎవరేనా ప్రియుడేమో - మొగుడు లేకండాచూసి ప్రేమ కలాపం జరుపుతోందేమో అని ఊహ తట్టింది. మాటలు తొందరగా గట్టిగా వినపడుతున్నాయి. ఆవిడ గొంతులో ఏదో భయం, బాధా వున్నాయి. అతని కుతూహలం హెచ్చింది. బలంగా వూచల్నిలాగి కదిపి ఊడదీశాడు. నేర్పుగా ఏర్పడిన జాగాలోంచి వంటింట్లోకి ప్రవేశించాడు. పక్కగదిలోనుండి మాటలు వినపడుతున్నాయి.

'వద్దండీ - నామాట వినండి.' ఆవిడ గొంతు.

'ఇస్తావా- తగలనియ్యనా.' మగగొంతు.

'ఎందుకు జూదమాడి తగలేస్తారు చెప్పండి. కాపరానికొచ్చిన నాటినుండి సరగాలేదు. సుఖంలేదు. ఉన్న ఆస్తంతా తగలేశారు. చాలదా!'

'వెధవ లెక్చరివ్వక మర్యాదగా తీసి ఇలా యియ్యి. లేకపోతే....'

'ఈ ఉన్న ఒక్క గొలుసూ యిస్తే నా గతి ఏం కాను. బాబు గతి ఏంకాను; చూడండి వాణ్ణి. కన్న కొడుకుని. మీకు దయలేదా జాలిలేదా! ఏమండీ - ఈవాళ్టికి ఊరుకోండి. పన్నెండు గంటలవుతోంది. ఒకర్తినీ బిక్కు బిక్కు మంటూ యింట్లో- రండి. పడుకోండి.'

కర్కశంగా వినపడింది యీ సారి మొగగొంతు - 'ఇస్తావా - పీక పిసికి చంపెయ్య మన్నావా. వెధవా పీడా పదుత్తుంది.'



'ఇవ్వను.'

'ఇవ్వవా'

'ఇవ్వనుగాక యివ్వను. ఇది మావుట్టింటివారు పెట్టింది. ఇది నా ఆస్తి.'

వింటూన్న గోపాలానికి ఆవిడ మాటలలో ఏదో న్యాయం గోచరించింది. ఆవిడ గొంతు తియ్యగా సన్నగా జాలిగా వుంది. గోపాలానికి ఆవిడ మొగుడిమీద కోపం వచ్చింది.

'నీ ఆస్తా -! ఏంవిటే పేలావు ముండా- ఇన్నాళ్ళూ తిన్నది నా డబ్బుకాదూ! తే - ఆ గొలుసుతే.'

'ఏంవండీ. ఇలా అన్యాయంగా మాట్లాడతారేమండీ....నేనుమాత్రం మీ కోసం, మీ బాగుకోసం కాదూ చెపుతున్నది. ఈగొలుసొక్కటే యింక మనకి ఆధారం. నాకు పసుపు కుంకుమ కింద మావాళ్ళు రాసిచ్చిన ఎకరమూ మీరు అమ్మేస్తే యేమైనా అన్నానా! మీరు తాగుతారు. జూదమాడతారు. మీకు మంచీ చెడ్డా భార్యా కొడుకూ అన్న విచక్షణ పోయింది. ఈనరకంలో మగ్గిపోతూ ఉండాల్సిందేనా. మీకాళ్ళు వట్టుకుంటాను నామాట వినండి.'

ఛెళ్ళుమని చప్పుడు వినిపించింది గోపాలానికి. ఆవిడని మొగుడు కొడుతున్నాడు. గోపాలానికి జాలీ ఉద్రేకమూ కలిగాయి. దీనంగా మధురంగా గద్గదికంగా వున్న ఆమెగొంతు అతన్ని ఆకట్టింది.

'కొట్టండి, చంపండి. నాగొలుసుమాత్రం యివ్వను.'

'ఇవ్వవూ, ఇవ్వవుటే పింజారిముండా.' మళ్ళీ గుద్దినట్టు చప్పుడు. ఆమె ఏడుస్తోంది నిస్సహాయంగా. దీనంగా బాధగా ఆమె ఆక్రోశించింది. ఇద్దరూ పెనగులాడుతూన్న ధ్వని వినపడింది గోపాలానికి.

'వొదలండి. నన్నొదలండి. అమ్మో.'

గోపాలం పిడికిళ్లు బిగించాడు. అతని కళ్ళలో ఎర్రజీర కదలింది.

'పీక పిసికి తీసుకెళతాను గొలుసు ఇలా పడెయ్యి.'

'ఎందుకివ్వాలి మీకు. జూదంలో తగలెయ్యడానికా' ఆమె వెక్కి- వెక్కి ఏడుస్తూనే మాట్లాడుతోంది. 'పిల్లవాడికి దగ్గు మందైనా తీసుకురాలేదు. ఒక్క మంచి చీరలేదు: కట్టుకున్న పెళ్లాం చచ్చిందో బతికిందో చూడరు. ఇంక వీధులమ్మట ముష్టెత్తుకుని బతకాలి నేను.'

'ఈ వేలెడు వెధవకోసం నాకివ్వవన్న మాట. ఆగు, వీడిని చంపేస్తాను. వీడి పీక నులిమేస్తాను.'

'అయ్యో అయ్యో వాణ్ణి ఏం చెయ్యకండి. అయ్యో అయ్యో' ఆవిడ పెద్ద పెట్టున కేకలు. పిల్లవాడు కెవ్వుమనిఏడుపు.

గోపాలం యింక ఆగలేకపోయాడు. కుర్రవాణ్ని పీక నులిమి చంపివేస్తున్న దృశ్యం అతని కళ్ళముందు కదలింది. బలమంతా ఉపయోగించి తలుపు తన్నాడు. రాలేదు. తిరిగి దడదడా తన్నాడు. తలుపులు విచ్చుకున్నాయి. ఆమె కుర్రవాణ్ని ఎత్తుకుని గోడమూలగా నక్కివుంది. వణికిపోతూ వుంది.

'బాబు నేమీ చెయ్యకండి. వొదలండి. ఇదిగో గొలుసు' అంటూ మీదకి రాక్షసుడిలా వొంగిన అతనికి గొలుసు యిస్తోంది. మొగుడు గొలుసు తీసుకుని వెనక్కి తిరిగాడు. ఎదురుగా గోపాలం.


నవ్వండి....! ఊరహూ నవ్వండి....!!

చేతైతే యింకా బోల్డు నవ్వండి .... లేపోతే మా దగ్గిర ఓటుంది....దాని ఖరీదు బో....ల్డు.... తుంఛెం అన్నమాట.... అజ్ఞాని (కొని) నవ్వండి....


దానిపేరేఁవిఁటంటే.... "నవ్వితే నవ్వండి" ఇన్దులో మూడువన్దల పైచిలుకు జోక్స్ వుంటాయి. వీటన్నిటినీ శ్రీ ముళ్లపూడి వెంకటరమణగారు సేకరించారు. ఈపుస్తకం యిదివర్లాలేదు. ఈసారి బలేబావుంది. కావాలంటే ఓటి కొన్చూడండి.... అన్దులో వన్ద పైచిలుకు కొత్తకార్టూన్లు ప్రత్యేకంగా కలిపి ఈసారి యింకా ఛక్కగా ముస్తాబుచేయిన్నాం. శాంపిల్ కాపీ రెండు వన్దల యాభై....నయాపైసలే సార్ ...



NAVODAYA PUBLISHERS VIJAYAWADA 2

నవోదయ పబ్లిషర్స్ విజయవాడ 2



'ఎవడవురా నువ్వు' అన్నాడు మొగుడు.

గోపాలం బలంగా అతని దవడమీద ఒకటి వేశాడు. మొగుడు తూలి పడబోయాడు. గోపాలం యీసారి మీది కురికి అతని తలవంచి బలంగా గుద్దాడు. అతను కిందపడ్డాడు.

'ఆడకూతుర్ని కొడతావా? ఆ గొలుసు కాజెయ్యాలని చూస్తావా? దొంగవెధవా. సిగ్గులేదురానీకు. బుద్ధిలేదురా.ఏది ఆగొలుసు యిలా ఇయ్యి. లేవకు. లేచావంటే పంపేస్తాను.'

గోపాలం అతని చేతిలోంచి గొలుసు లాక్కున్నాడు. అతను కిందపడి వగరుస్తున్నాడు. రొప్పుతున్నాడు. ఆమె యీ హఠాత్పరిణామం అర్థంకాక నిశ్చేష్టురాలై గోడకి బల్లిలా అంటుకుని కళ్ళప్పగించిచూస్తోంది.

'తాగుడూ జూదమూ నష్టానీకు. చదువుకున్నోడివి. ఉద్యోగం చేసి పెళ్లాం పిల్లల్ని పోషించాల్సింది. పైగా పెళ్లాం నగలే ఎత్తుకుపోతావట్రా దొంగనాయాల....'

నేలను కరచుకున్నా మొగుడు అస్పష్టంగా బూతులు తిడుతున్నాడు. గోపాలం డొక్కలో ఒకటి తన్ని 'నోర్ముయ్యి' అన్నాడు. ఆమె 'వద్దు వద్దు-కొట్టకు' అని అరచింది.

గోపాలం చేతిలో గొలుసుతో గోడవారనున్న ఆమెను సమీపించాడు. ఆమె సన్నగా ఎర్రగా నాజూకుగావుంది. జుట్టంతా రేగిపోయివుంది. చెక్కిళ్లు కన్నీళ్ళతో తడిసిపోయివున్నాయి. పాతికేళ్ళ యినా వుండవు. ఆమె కళ్ళలో భయాశ్చర్యాలు పెనవేసుకున్నాయి. చంకలో పిల్లవాడు ఏడుస్తున్నాడు.

'ఇదిగోనమ్మా గొలుసు' అంటూ ఆమె చేతికి గొలుసు యిచ్చాడు గోపాలం. కిందదొర్లుతూన్న మొగుడు లేవబోయాడు. గోపాలం మొలనుండి కత్తి తీశాడు.

'ఇదేఁవిటో తూశావా! లేవటానికి ప్రయత్నించావా పొడిచేస్తాను కబడ్దార్. దెబ్బకి యెగిరిపోతావు.'

మొగుడు దండం పెట్టాడు.

'నువ్వు మళ్ళీ ఎప్పుడేనా గొలుసు తీసుకున్నట్టు కాని. ఆవిడ వొంటిమీద దెబ్బ పడినట్టుగాని తెలిసిందా నీప్రాణం తీసేత్తాను' గోపాలం కత్తిని అతని ముఖానికి దగ్గరగా పెట్టి ఝళిపించాడు.

మొగుడు తలవూపాడు యింకెప్పుడూ చెయ్యనన్నట్టుగా.

గోపాలం ఆమెవైపు తిరిగాడు. 'ఏం భయంలేదు. ధైర్యంగా వుండమ్మా' అన్నాడు.

ఆమె భయంతో కృతజ్ఞతతో తల వూపింది.

గోపాలం కత్తి మొలలో పెట్టుకునివెళ్ళిపోబోయాడు. ఆమె హీనస్వరంతో అడిగింది. 'ఎవ్వరు బాబూ నువ్వు....'

'నేనా....నేనా' తెల్లబోయాడు గోపాలం. 'నన్ను గోపాలం అంటారులెండి. అంతే.' అంటూ గోపాలం తలెత్తకుండా వడివడిగా పెరట్లోకి చీకట్లోకి నడిచి వెళ్ళిపోయాడు.

□□□

